క్లుప్తంగా

వైభవంగా సత్యసాయి నామ సంకీర్తన



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఏలూరు అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సత్య సాయిబాబా 99వ జయంతిని పురస్కరించుకొని ఏలూరు సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రామకృష్ణాపురం లోని శ్రీ సత్య సాయి మందిరంలో శనివారం నుంచి ఆదివారం రాత్రి వరకూ 24 గంటల పాటు నామ సంకీర్తన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి బాబాకు ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశిశేఖర రావు, కన్వీనర్ పైడేటి రామారావు, జిల్లా కోఆర్డినేటర్లు సోడిశెట్టి శాంతకుమార్, వై. వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 100 మంది వృద్ధులకు, మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

కాంచన మాల సేవలు ఆదర్శనీయం



కోయ కాంచనమాల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని సీఆర్ ఆర్ పబ్లిక్ స్కూల్‌కు 29 ఏళ్ల కరస్పాండెంట్‌గా సేవలందించి పాఠశాలలో ఎన్నో సంస్కరణలు తీసుకురావడంతో దాతృత్వ కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచారని డాక్టర్ కోయ కాంచన మాల విశేష కృషి చేశారని సీఆర్ రెడ్డి విద్యా సంస్థల పాలక మండలి చైర్మన్ అల్లూరి ఇంద్ర కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్లో స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన దివంగత కరస్పాండెంట్ డాక్టర్ కోయ కాంచనమాల కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల వైస్ ప్రెసిడెంట్ వీవీ బాలకృష్ణారావు సేవలను వివరించారు. విదేశాలలో స్థిరపడిన కాంచనమాల కుమారులు శ్రీనివాస్, మధు సూధనరావు, కుమార్తె పద్మజ తమ తల్లి జ్ఞాపకాలను స్కూలు సిబ్బంది, విద్యాసంస్థల యాజమాన్యంతో పంచుకున్నారు.కార్యక్రమంలో మేనేజింగ్ కమిటీ సభ్యులు వంకినేని రఘుకుమార్, ప్రిన్సిపాల్ పీ. సాయి కుమారి శంకర్, స్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

చీకటి పడితే.. కాలనీల్లో అంధకారమే!

- చిన్న సమస్య... పెద్ద నిర్లక్ష్యం
- విద్యుత్ స్తంభాలు వేశారు.. వీధి లైట్లు మరిచారు
- ఆదివారపుపేట మార్కెట్ వెనుక రోడ్డులో వెలగని విద్యుద్దీపాలు
- బీడీ కాలనీలోనూ వెలగని వీధి లైట్లు
- ప్రజలు ఫిర్యాదు చేసినా స్పందించని సిబ్బంది



ఆదివారపు పేట మార్కెట్ వెనుక రోడ్డులో లైట్లు లేకపోవడంతో చీకటి అలుముకున్న దృశ్యం



ఆదివారపుపేట మార్కెట్ వెనుక రోడ్డులో విద్యుత్ దీపం లేని స్తంభం



బీడీ కాలనీలో వీధిలైట్ల విద్యుత్ మీటర్‌కు ఫ్యూజు లేకుండా నేరుగా కనెక్షన్ కలిపిన దృశ్యం

ఏలూరు (టూటౌన్): అలవికాని హామీలు సూపర్ సిక్స్ పథకాల పేరిట ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజాసమస్యలను గాలికొదిలేసిందంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదని అధికారులకు ఫిర్యాదు చేస్తే గతంలో కరెంటు పోల్ మార్చారని దానికి ఉన్న వీధి దీపం విద్యుత్‌శాఖాధికారులు తీసుకువెళ్లిపోయారని దాన్ని మరలా అమర్చాలంటే దానికి ఎమ్మెల్యే అనుమతి కావాలంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారని ప్రజలు అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ విధమైన పరిణామాలతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. నగరపాలక సంస్థ కార్పొరేటర్లు, ప్రజలు విద్యుత్ సిబ్బందికి ఫోన్ చేసి సమస్యను చెప్పినా పట్టించుకోని పరిస్థితులు పలు చోట్ల కనిపిస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా ఏమిటీ వింత ధోరణి అంటూ ప్రజలు నవ్వుకుంటున్నారు.

ఆదివారపు పేటలో అంధకారంలో రాత్రిళ్ల ప్రయాణం

స్థానిక ఆదివారపు పేట మార్కెట్ వెనుక రోడ్డులోని ప్రశాంతి కుమారి ఆసుపత్రి వీధిలో కొద్ది నెలలుగా వీధి దీపాలు వెలగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్డీయే కూటమి నాయకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడి సమస్యలు అక్కడే అపరిష్కృతంగా ఉన్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. గతంలో ఓ ఇంటి ముందున్న విద్యుత్తు స్తంభంతో ఇబ్బందిగా ఉందని నాయకులకు తెలపగా అక్కడి నుంచి కొద్దిగా పక్కకు ఆ స్తంభాన్ని జరిపి ఏర్పాటు చేశారు. స్తంభానికి విద్యుత్తు దీపం ఏర్పాటు చేయాలని నగర పాలక సంస్థ అధికారులకు స్థానికులకు మొర పెట్టుకున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. చాలా స్తంభాలకు విద్యుద్దీపాలు లేకపోవడంతో రాత్రిళ్ల అంధకారం అలముకుని రాక పోకలకు అవస్థలు పడుతున్నామని పలువురు చెబుతున్నారు. దీనికి తోడు చెట్లు పెరిగి కొమ్మలు కరెంట్ తీగలపై పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై నగర పాలక సంస్థ ఏఈ సాంబశివరావుకి ఈ సమస్యపై పలుమార్లు చెప్పిన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ సమస్యలపై దృష్టి సారించి కాలనీల్లో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మారని నిర్లక్ష్య ధోరణి

ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్, ఎలక్ట్రికల్ సిబ్బంది ఒకరి మీద ఒకరు నెపం నెడుతూ మాకు సంబంధం లేదంటూ కాలయాపన చేస్తున్నారని కాలనీ వాసులు అంటున్నారు. స్థానిక ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ బీడీ కాలనీ వాటర్ ట్యాంక్‌లో కరెంటు మీటరు వద్ద విద్యుత్ తీగలు అస్తవ్యస్తంగా, ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. నెల రోజుల నుంచి చాలా దారుణంగా ఇక్కడి పరిస్థితి ఉంది. ఇదే విషయంపై స్థానిక కార్పొరేటర్ తంగిరాలా అరుణ సురేష్ అధికారులతో మాట్లాడి వారం రోజులు కావస్తున్నా అధికారుల్లో మాత్రం చలనం కనిపించడం లేదు. పైగా ఏఈ కొత్తగా వచ్చారు, పైగా సెలవు రోజులు చూస్తాం.. చేస్తాం అంటూ అధికారులు జాప్యం చేస్తున్నారు. విద్యుత్ సమస్యలపై అధికారులు సకాలంలో స్పందించాలని, స్తంభాలన్నింటికీ విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని 28వ డివిజన్ బీడీ కాలనీ వాసులు కోరుతున్నారు. ముఖ్యంగా వాటర్ ట్యాంక్ పరిధిలో విద్యుద్దీపాలు వెలగకపోవడంతో చీకట్లో పిల్లలు, వృద్ధులు నడిచి వెళ్లేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. పాములు, విష పురుగులు అధికంగా సంచరించడంతో అవి వారిని కుట్టే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంటు స్తంభాలు పొదలు, పొదులతో నిండిపోయి ఎటువంటి నిర్వహణ లేకుండా ప్రమాదంగా ఉంటున్నాయని స్థానికులు తెలిపారు.

వీధి దీపాలు వెలగడం లేదు



నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడం కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధుల కనీస బాధ్యత అని గుర్తుంచుకోవాలి. కార్పొరేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. తక్షణం సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా నాయకులు, ఏలూరు

ప్రజా సమస్యలు గాలికి వదిలేశారు



ఏలూరు కార్పొరేషన్‌లో ప్రజా సమస్యలను గాలికి వదిలేశారు. కనీస అవసరమైన వీధి లైట్లు ఏర్పాటు చేసే విషయంలోనూ స్థానిక ప్రజా ప్రతినిధి అనుమతి కావాలని విద్యుత్‌శాఖాధికారులు చెప్పడం సిగ్గు చేటు. చిన్న సమస్యలను తీర్చడంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది మీనమేషాలు లెక్కించడం బాధాకరం.

– పి.కిషోర్, సీపీఎం నగర కార్యదర్శి, ఏలూరు

పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం



ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు

ఏలూరు (టూటౌన్): కార్మికుల సమస్యల పరిష్కారానికి పాలకులను నిలదీయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్కూల్ స్వీపర్స్ యూనియన్ రెండవ రాష్ట్ర మహాసభ సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనములో ఆదివారం నిర్వహించారు.ఎస్.విజయ్ కుమారి, డి.సునీత, ఎం.కుమారి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జి. ఓబులేసు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత 8 సార్లు నిర్వహించిన క్యాబినెట్ సమావేశాల్లో కార్మికుల సమస్యలపై ఏనాడూ చర్చించిన దాఖలాల్లేవని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలలో పనిచేసే కార్మికులను ఆయాలుగా కాకుండా స్వీపర్లుగా గుర్తించి కనీస వేతనం 108 జీఓ ప్రకారం రూ.11,500 ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో పారిశుద్ధ్య కార్మికులు, స్వీపర్లు ఒకే విధమైన పని చేస్తున్నారని, వీరిని ఉద్యోగులుగా గుర్తించి రూ.21 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 100 మంది పైబడిన ప్రతి హై స్కూలుకు ఒక ఆయాను అదనంగా పెంచి పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. స్వీపర్లకు పీఎఫ్, ఈఎస్ఐ. సౌకర్యం కల్పించాలన్నారు.ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకటరామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో 49,550 పాఠశాలల్లో 44,600 మంది స్వీపర్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కారణంగానే ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకోవడానికి స్వీపర్ల స్థానంలో ఆయాలుగా పేరు మార్చారని ఆరోపించారు.ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకట సుబ్బయ్య, యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరాములు, యూనియన్ ప్రస్తుత అధ్యక్షుడు ఎస్. జయకుమారి, ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగ, కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న కూనపాముల విఘ్నేష్

ఏలూరు (టూటౌన్): ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా విస్తృత సమావేశం 23న జంగారెడ్డిగూడెంలో నిర్వహించనున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షుడు కూనపాముల విగ్నేష్ తెలిపారు. జంగారెడ్డిగూడెంలో నిర్వహించనున్న సమావేశం ప్రాముఖ్యతను వివరిస్తూ ఏలూరు ఆర్‌ఆర్ పేట ఎస్ఆర్‌టూ వద్ద ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్నేష్ మాట్లాడుతూ వివిధ కార్పొరేషన్లలో పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగ, కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ అప్పలరాజు మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై 23న చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి బి నారాయణరావు యూనియన్ సహాయ కార్యదర్శి ఎస్ శ్రీనివాసు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



పీఆర్టీయూ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పీఆర్టీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల కరువు భత్యం బకాయిలు విడుదల చేయాలని, మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని, పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణం బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సంపాదిత సెలవుల నగదు జమ చేయాలని, పదవీ విరమణ పొందిన వారికి చెల్లించాల్సిన సొమ్మును సకాలంలో వారి ఖాతాల్లో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నెలవారీ పదోన్నతులు పునరుద్ధరించి, ఉన్నత పాఠశాలల్లో పదవీ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలు భర్తీ చేయాలని, 117 జీఓను రద్దు చేయడంతో పాటు 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల నుంచి పూర్వపు ప్రాథమిక పాఠశాలలకు పంపాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 20 మంది విద్యార్థులకు ఒకరు, 60 మంది వరకూ ఇద్దరు మాత్రమే హేతుబద్ధీకరణ ద్వారా కేటాయించారని, ఈ ఉపాధ్యాయ నిష్పత్తిని పీఆర్టీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో పోస్టుల కేటాయింపు అగమ్యగోచరంగా ఉందని, 98 రోజులను ప్రాతిపదికగా తీసుకుని ఎస్ఏలను, ఎస్జీటీలను ఎప్పటికప్పుడు మార్చడం తగదన్నారు. ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ పనులు, యాప్‌ల భారం, వివిధ రకాల శిక్షణ వంటి బోధనేతర పనులను నిలుపుదల చేయాలని, లేని పక్షంలో పాఠశాలలకు కంప్యూటర్లను ఏర్పాటు చేసి ఆపరేటర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సుబ్బారావు, ఉపాధ్యక్షుడు డీఎస్ ప్రసాద్, నాయకులు బెజవాడ ధర్మారావు, ఎం.లక్ష్మీ భీమేశ్వరి, ఎస్‌డీ ముర్సలీన్, సమ్మిశెట్టి శ్రీనివాసరావు, వివిధ మండలాల రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేయాలి

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ డిమాండ్ చేశారు. సీపీఐ ఏలూరు ఏరియా కార్యవర్గ సమావేశం స్థానిక ఆర్.ఆర్.పేట, స్ఫూర్తి భవన్‌లో అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలని హేమ శంకర్ కోరారు. సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గత ప్రభుత్వంలో పట్టాలు పొందిన లబ్ధిదారుల నుంచి అర్జీలను సేకరించి నవంబర్ 18న గ్రామ వార్డు సచివాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ నెల 11 నుంచి పట్టాదారుల వివరాల సేకరిస్తామన్నారు. అనంతరం కరపత్రాన్ని ఆవిష్కరించారు. గొర్రెల వరప్రసాద్ కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల లక్ష్మి ఇందిర, బళ్ల కనకదుర్గారావు, తెర్లాపు శ్రీను పాల్గొన్నారు.

బీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి



రైతు సంఘ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): సమగ్ర పంటల బీమా పథకం తీసుకురావాలని, బీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక అన్నే భవనంలో నిర్వహించిన రైతు సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ఆదివారం మాట్లాడారు. రబీ పంట కాలానికి రైతులు ప్రీమియం చెల్లించాలని, 2019 నాటి పంటల బీమా పథకం అమలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. గత ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం అమలు చేసి ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించిందని శ్రీనివాస్ గుర్తు చేశారు. ప్రీమియం పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నారే తప్ప పంట నష్టం జరిగిన సందర్భంలో రైతులకు బీమా పరిహారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పంటలకు బీమా పథకం అమలు చేయాలని కోరారు. రబీ పంట కాలానికి ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని విజ్ఞప్తి చేశారు.

రబీ సాగునీటిపై స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలి

గోదావరి, కృష్ణా డెల్టాలకు రబీ సాగునీరు విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని కోరారు. జిల్లాలో వరి కోతలు ప్రారంభమై రబీ సాగుకు అన్నదాతలు సమాయత్తమవుతున్న ఈ దశలో కృష్ణా, గోదావరి డెల్టాల పరిధిలో రబీ సాగుకు సాగునీరు విడుదలపై ఎటువంటి నిర్ణయాలు జరగకపోవడంతో అన్నదాతలు అయోమయ స్థితిలో ఉన్నారని చెప్పారు. ప్రాజెక్ట్ కమిటీల సమావేశాలు నిర్వహించి సాగునీరు విడుదలపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించగా సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, జిల్లా సహాయ కార్యదర్శి కొన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	19
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	32
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు - తిరుపతి	16.00	4830	30

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	96
వంకాయలు (కాంతులు)	50-68	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	44-56	ములక్కాడలు	07, 10
బెండకాయలు	34	కంద	64
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	64
కాకర కాయలు	40-44	కీరా దోస	36
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	90
బీరకాయలు (పందిరి)	00	అల్లం	80
క్యాబేజీ	36-40	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	60	పాలకూర	15
దొండకాయలు	28	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	15
ఉల్లిపాయలు	45-55	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	40	బఠాణి	--
ఆనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	96
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44

సంగీతానికి పాచ్చా సాహెబ్ విశేష సేవలు



సంగీత విభావరిలో కీర్తనలు ఆలపిస్తున్న చిన్నారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రస్థాయిలో పేరు పొందిన ప్రముఖ సంగీత విద్వాంసుడు సయ్యద్ పాచ్చా సాహెబ్ సంగీత రంగానికి చేసిన సేవలు విశేషమైనవని అతిథులు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో పాచ్చా సాహెబ్ 25వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఏలూరుతో పాటు జిల్లాలోని అనేక మందికి వివిధ సంగీత వాయిద్యాల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చిన సంగీత కళాకారులుగా తీర్చిదిద్దడంలో పాచ్చా సాహెబ్ విశేష కృషి చేశారన్నారు. ఆయన మనుమడిగా ఎస్‌పీఎస్ వాసు సంప్రదాయ సంగీత వాయిద్యాలతో పటు ఆధునిక వాయిద్యాల్లో ప్రావీణ్యం పొంది ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ స్థాపించి ఎంతోమందిని సంగీత కళాకారులుగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. కార్యక్రమం అనంతరం ఎస్‌పీఎస్ వాసు సంగీత సారథ్యంలో వహిదా వాసు, చిన్నారి ఎస్‌పీఎస్ దీప్‌చంద్, వై.అర్జున రావు, పాడనా తీయగా కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులతో నిర్వహించిన సంగీత విభావరి సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది. ఎమ్మెల్యే బడేటి చంటి, కళారత్న కేవీ సత్యనారాయణ, మానవత సంస్థ అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వర రావు, సెట్‌వెల్ సీఈఓ ఎం. ప్రభాకరరావు, ఫాదర్ టీ. ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రవితేజ ఎంపిక

పెదవేగి : జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పెదవేగి మండలానికి చెందిన సచివాలయ ఉద్యోగి ఎంపికయ్యారు. ఆల్ ఇండియా ఉద్యోగ సివిల్ సర్వీస్ 2024–25 క్రీడల్లో పాల్గొనేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో ఈనెల 6, 7 తేదీల్లో గుంటూరులో అథ్లెటిక్స్ పోటీలు, సెలెక్షన్స్‌లో పురుషుల 400 మీటర్ల రన్నింగ్ విభాగానికి మేడంకి రవితేజ ఎంపికయ్యాడు.

జమిలి ఎన్నికలతో దేశ ఫెడరల్ వ్యవస్థకు భంగం

ఏలూరు (టూటౌన్): జమిలి ఎన్నికలు దేశ ఫెడరల్ వ్యవస్థకు భంగం కలిగిస్తాయని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రజా పోరు యాత్రలో ఏలూరులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రాంతీయ పార్టీల మద్దతుతో అధికారంలో వచ్చినప్పటికీ తన మతోన్మాద ఆర్ఎస్ఎస్ విధానాన్ని ముందుకు తీసుకెళుతోందని దుయ్యబట్టారు. జమిలి ఎన్నికల విధానం అమలయితే రాష్ట్రాల్లో ఉండే ప్రాంతీయ పార్టీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు బీజేపీపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాలని కోరారు. సీపీఎం నగర కార్యదర్శి పి కిషోర్ మాట్లాడుతూ ఏలూరులోని పలు కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని, ప్రజలకు తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. పోరు యాత్ర వెంకటాపురం పరిధిలోని 19 డివిజన్ హనుమాన్ నగర్, ఎన్టీఆర్ కాలనీ, సుందరయ్య కాలనీ, శ్రీనివాస్ నగర్, శ్రీ గార్డెన్స్, హరిప్రియ నగర్, కొత్తూరు ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో సాగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఏ శ్యామల రాణి, కే లెనిన్, నగర నాయకులు వి సాయిబాబు, బి జగన్నాథరావు, వీవీఎన్ ప్రసాద్, ఎస్ సత్యనారాయణ, జి శారద, కే నాగమణి తదితరులు పాల్గొన్నారు.